నమస్తే తెలంగాణ
Telangana Today
నిపుణ
నమస్తే తెలంగాణ
హైదరాబాద్, ఆదివారం 4 మే 2025
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

ఎగుమతులే వృద్ధిగా.. ఆర్థిక దౌత్యానికి అండగా!

ఎగుమతులు దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతాయి. పేదరికం, నిరుద్యోగాన్ని తగ్గించడంలో ప్రభుత్వాలకు సాయపడతాయి. వాణిజ్య ప్రయోజనాల న్యాయమైన పంపిణీని నిర్ధారించే నియమాలూ ఎంతో అవసరం. ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలపై పెట్టుబడి పెట్టాలి. ఎగుమతి ఆధారిత అభివృద్ధి, డిజిటల్ నైపుణ్యాలు, సేవల సామర్థ్యాల పెంపు తదితర వివరాలు సంక్షిప్తంగా...

భారతదేశ ఎగుమతుల వృద్ధి కోసం నైపుణ్యాల పెంపు

- ఇప్పుడు ఎగుమతి ఆధారితమైన అభివృద్ధి ద్వారా దేశ ఆర్థిక భవిష్యత్తును గొప్ప మలుపు తిప్పగల కీలకమైన కూడలిలో భారత్ ఉంది.
- డిజిటల్ నైపుణ్యాలను ఉపయోగించడం ద్వారా పారిశ్రామిక ఉత్పత్తి, సేవల సామర్థ్యాన్ని పెంచడం, ప్రపంచ వ్యాప్తంగా విలువ గొలుసుల్లో స్థిరమైన ప్రత్యామ్నాయంగా తనను తాను చూపించుకోవడం ద్వారా భారత్ ముఖ్యమైన ఎగుమతి శక్తి కేంద్రంగా రూపొందవచ్చు.
- భారత్ 20 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలంటే హరిత సాంకేతిక, అంతరిక్ష సాంకేతిక, తయారీ, సేవా రంగాల్లో అదనపు విలువల జోడింపు, మౌలిక సదుపాయాల మెరుగుదల, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల సాధికారత వంటి చాలా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం అవసరమవుతుంది.
- గతేడాది ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యం పెరుగుదల రేటు 2 శాతానికి పడిపోయింది.
- అయినప్పటికీ భారత్ మాత్రం రసాయనాలు, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఔషధాల వంటి అధిక విలువ కలిగిన పరిశ్రమల్లో గొప్ప పనితీరు చూపిన కారణంగా పెట్రోలియమేతర ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధి రేటును 7 శాతం పెంచుకోగలిగింది.
- భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 2021 ఆర్థిక సంవత్సరంలో 11 బిలియన్ డాలర్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 26 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- ఉత్పత్తి ప్రోత్సాహక ఆధారిత విధానాలు, పరిశ్రమలకు అనుకూలమైన చట్టపరమైన చర్యల ద్వారా వృద్ధి సాధన సులభతరమైంది.
- కొవిడ్ అనంతరం దేశంలోని సంప్రదాయేతర పరిశ్రమలు తిరిగి వేగం పుంజుకుంటున్నాయి.

ఉదా: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వస్త్ర ఎగుమతులు 7.6 శాతం పెరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 2025 గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

- ఎగుమతి ఆధారిత అభివృద్ధి జాతీయ సంపదను ఎలా ప్రోత్సహిస్తుందో చూపించేందుకు చైనా, దక్షిణ కొరియా, వియత్నాం వంటి దేశాల ఉదాహరణలను దృష్టిలో కేంద్రీకరించడం చాలా ముఖ్యమని స్పష్టమవుతుంది.
- ప్రస్తుతం భారతదేశం సేవలు, మూలధన ప్రాధాన్య రంగాలపై ఆధారపడటానికి మించి, బహుళజాతి కంపెనీలను ఆకర్షించడానికి దాని కార్మిక శక్తిని, పారిశ్రామిక సామర్థ్యాన్ని ఉపయోగించాలి.
- భారత్ సుమారు 200 మిలియన్లకు పైగా అధిక నాణ్యత ఉద్యోగాలను సృష్టించడమే గాక, అగ్ర శ్రేణి తయారీ కేంద్రంగా తనను తాను నిరూపించుకోవడం ద్వారా జీవన పరిస్థితులను కూడా మెరుగుపరచవచ్చు.

ఎగుమతులపై ఆధారం

- ప్రపంచ మార్కెట్లను లక్ష్యంగా చేసుకున్న పరిశ్రమలు భారతదేశ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడమే గాక నిరుద్యోగం తదితర సమస్యలను పరిష్కరించడానికి సాయపడతాయి.
- ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం కారణంగా స్మార్ట్‌ఫోన్ తయారీలో వేగవంతమైన వృద్ధి గణనీయమైన ఉపాధిని సృష్టించింది.
- ప్రపంచవ్యాప్తమైన విలువ గొలుసుల్లో చేర్చడం ద్వారా, ఎగుమతి ఆధారిత తయారీ భారతదేశాన్ని ఆధునిక సాంకేతికతలు, ప్రపంచ ఉత్తమ పద్ధతులతో అనుసంధానిస్తుంది.
- ఇది సృజనాత్మకత ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. దేశీయ కంపెనీలు అంతర్జాతీయంగా పోటీ పడటానికి వీలు కల్పిస్తుంది.
- ఎగుమతి ఆధారిత అభివృద్ధి దేశంలో రెండు, మూడో శ్రేణి నగరాల్లో పారిశ్రామికీకరణకు తోడ్పడుతుంది. తద్వారా ఆర్థిక కార్యకలాపాలను పంపిణీ చేస్తుంది. ప్రాంతీయ అసమానతలను తగ్గిస్తుంది.
- తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో, అభివృద్ధి చెందని ప్రాంతాల్లో సమాన అభివృద్ధిని ప్రారంభించడానికి తయారీ కేంద్రాలు పెరిగాయి.
- ప్రధాన వాణిజ్య భాగస్వాములతో పరస్పర ఆధారితాలను సృష్టించడంతో ఎగుమతుల వృద్ధి దేశ మృదువైన శక్తిని బలపరుస్తుంది.
- ఆర్థిక దౌత్యానికి మద్దతు ఇస్తుంది.
- ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాల ద్వారా ఇది ఏషియన్, యూఎస్ దేశాలతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలకంగా మారింది.
- ఎగుమతి ఆధారితమైన పునరుత్పాదక ఇంధన శక్తి వినియోగం, హరిత సాంకేతికతలు దేశ, ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్పులో అగ్రగామిగా ఎదగడానికి ఎంతగానో సాయపడతాయి.

ఎగుమతుల వృద్ధికి అవరోధాలు

- దేశంలోని కాలం చెల్లిన మౌలిక సదుపాయాలు, వ్యూహరచన అసమర్థతలు ఎగుమతి ఖర్చులను పెంచుతాయి.
- భారతీయ వస్తువుల ప్రపంచ పోటీతత్వాన్ని తగ్గిస్తాయి.
- అధిక లాజిస్టిక్స్ ఖర్చులు, తగినంత వాణిజ్య మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి వాటికి దారి తీస్తాయి.
- పరిమిత వాహన సామర్థ్యం, ఓడరేవు రద్దీ, చివరి మజిలీ అనుసంధానతలో అడ్డంకుల వల్ల అనేక సవాళ్లు తీవ్రమవుతాయి.
- ప్రధానమంత్రి గతి శక్తి ప్రణాళిక వంటి ప్రయత్నాల ద్వారా పురోగతి సాధించినప్పటికీ, దేశ లాజిస్టిక్స్ ఖర్చు- జీడీపీ నిష్పత్తి ఇతర దేశాలతో పోలిస్తే ఎక్కువగానే ఉంది.
- దేశ ఎగుమతి పోర్ట్‌ఫోలియో ఎక్కువగా ఐటీ సేవలు, పెట్రోలియం ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాల వంటి ఇరుకైన రంగాలపై దృష్టి పెడుతుంది.
- దీని వల్ల ఈ పరిశ్రమల్లో క్షీణతకు గురయ్యే ఆస్కారం ఉంది.
- హరిత ఎగుమతులు ఇంకా పూర్తి పరిపక్వతకు చేరుకోని ఒక నవజాత వ్యాపారంగా ఉన్నాయి.
- ముఖ్యంగా వస్త్ర, వ్యవసాయ రంగాల్లో విలువ ఆధారిత ఎగుమతులు లేకపోవడం ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగిస్తుంది.
- వాణిజ్య రక్షణ వాదం, పన్నులు, మారుతున్న భౌగోళిక రాజకీయ గతిశీలత దేశ ఎగుమతి వృద్ధికి గణనీయమైన సవాళ్లను కలిగిస్తున్నాయి.
- అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటి పారిశ్రామిక దేశాలు అమలు చేస్తున్న కఠినమైన పర్యావరణ నియమాలు, కర్బన లెవీలు దేశ కర్బన వినియోగ తీవ్రత కలిగిన ఎగుమతులపై ప్రభావం చూపవచ్చు.
- రష్యా ఉక్రెయిన్ వివాదం ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలను తీవ్రతరం చేసి కీలకమైన సహజ వనరులను కూడా ప్రభావితం చేసింది. చిన్న, మధ్య తరహా సంస్థలు ఖర్చు- సమర్థవంతమైన ఎగుమతుల కోసం పెట్టుబడి పొందడంలో ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.
- అధిక రుణ వ్యయాలు, సంక్లిష్ట ఆర్థిక విషయాలు, ఎగుమతి రుణ పథకాలకు సంబంధించిన విజ్ఞాన సమాచారం లేకపోవడం వల్ల కార్యకలాపాలను విస్తరించడానికి, నూతన మార్కెట్లలోకి ప్రవేశించడానికి వారి సామర్థ్యం పరిమితమైంది.
- ఆర్థిక పెట్టుబడులు మొత్తం మీద గణనీయంగా పెరిగినప్పటికీ, భారత ఎగుమతిదారులు మాత్రం ఇంకా పలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నారు.
- గత రెండేళ్లలో ఎగుమతి రుణాలు ఐదు శాతం తగ్గిపోగా ఎగుమతులకు ప్రాధాన్య రంగ రుణాలు 41 శాతం మేరకు తగ్గాయి.
- భారత ఎగుమతి సంస్థల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని త్వరగా పరిష్కరించాలని ఆర్థిక మంత్రిని, భారత రిజర్వ్ బ్యాంక్‌ను కోరింది.
- కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక పరిమితులు, ధ్రువీకరణ ఆదేశాల వంటి సుంకాలకు అతీతమైన అడ్డంకులు భారతీయ ఎగుమతిదారులకు గణనీయమైన సవాళ్లను విసురుతున్నాయి.
- యునైటెడ్ స్టేట్స్, యూరోపియన్ యూనియన్ వంటి ప్రధాన మార్కెట్లు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ వస్తువులు, ఔషధాలపై కఠినమైన నిబంధనలను అమలు చేస్తాయి. అందువల్ల ఒప్పంద ఖర్చులు పెరుగుతాయి.
- గత ఐదేళ్లలో శానిటరీ, ఫైటోశానిటరీ ప్రమాణాల ఉల్లంఘనల కారణంగా దేశం నుంచి 3,925 మానవ ఆహార ఎగుమతి సరుకులను యునైటెడ్ స్టేట్స్ కస్టమ్స్ శాఖ తిరస్కరించింది.

ఎగుమతుల పెంపునకు కార్యక్రమాలు

- భారత ప్రభుత్వం రూ.2,250 కోట్ల బడ్జెట్‌తో ఎగుమతి ప్రోత్సాహక పథకాన్ని చేపట్టింది.
- దేశంలో ఆర్థిక వృద్ధికి ఎగుమతులు నాలుగు ప్రాథమిక చోదక శక్తుల్లో ఒకటని ఇది గుర్తింపునిచ్చింది.
- ఈ కార్యక్రమం ద్వారా సరిహద్దులకు మద్దతును పెంచడం, ఎగుమతి ఆర్థిక మద్దతును సులభంగా అందుకోవడం, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో సుంకం కాని వాణిజ్య అడ్డంకులను తొలగించడమే లక్ష్యం.
- ఈ లక్ష్యం అమలు వల్ల చాలా కాలంగా కొనసాగుతున్న నిర్మాణాత్మక అడ్డంకులు, రంగాల వారీ సవాళ్లను పరిష్కరించడం ద్వారా భారతీయ ఎగుమతిదారులకు మరింత ఊహించదగిన వాణిజ్య వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు.
- వాణిజ్య డాక్యుమెంటేషన్, ఆర్థిక సాయాన్ని సరళీకృతం చేయడానికి, మెరుగైన సామర్థ్యాన్ని సాధించడానికి 'భారత్‌ట్రేడ్‌నెట్' పేరుతో డిజిటల్ నెట్‌వర్క్‌ను సృష్టించే అంశాన్ని కూడా బడ్జెట్‌లో చేర్చారు.
- సింగపూర్, యూరోపియన్ యూనియన్ వంటి స్థిరపడిన వాణిజ్య కేంద్రాల నుంచి ప్రపంచ ఉత్తమ పద్ధతులతో దేశ వాణిజ్య మౌలిక సదుపాయాలను చేర్చడం, ప్రస్తుత ఏకీకృత వ్యవహార వినిమయ వేదిక స్థాయిని పెంచడానికి తోడ్పడుతుంది.
- వాస్తవ సమయ పర్యవేక్షణ, పత్రాల దొంతర్ల తగ్గింపు ద్వారా ఈ-ప్లాట్‌ఫామ్ లావాదేవీ ఖర్చులను తగ్గించడం, వ్యాపార కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వాణిజ్య పారదర్శకతను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది.
- వాణిజ్య సంబంధిత ఖర్చులను తగ్గించడానికి, జాతీయ ఎగుమతి పోటీతత్వాన్ని పెంచడానికి, దేశ లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి బడ్జెట్ ప్రాధాన్యతను ఇస్తుంది.

గ్రూప్-1 ప్రత్యేకం

జనరల్ ఎస్సే

- డిజిటల్ జియోస్పేషియల్ డేటా ఏకీకరణ, వాయు రవాణాకు మద్దతు ఇచ్చే మౌలిక సదుపాయాల మెరుగుదల అనేవి రెండు ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించారు.
- ఈ విధానం ప్రపంచవ్యాప్తంగా దేశ శ్రామిక శక్తి బ్రాండ్‌ను అభివృద్ధి చేయడమే గాక ఒక్కసారిగా చెల్లింపులనూ పెంచుతుంది.
- ఉపాధిని పెంచడానికి, వ్యవస్థాపకతకు మద్దతు ఇవ్వడానికి, ఎగుమతులు, డిజిటల్ తయారీ రంగాలతో సహా ముఖ్యమైన రంగాలను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన సృజనాత్మక ఆలోచనలను ఉపయోగించి దేశం 2025కి సిద్ధమవుతున్నందున స్కిల్ ఇండియా మిషన్‌లో మార్పులు చేస్తున్నారు.
- ఎగుమతులు, డిజిటల్ నైపుణ్యాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి నొక్కి చెప్పడం వల్ల దేశ శ్రామిక శక్తి పరివర్తన చెందడానికి, ప్రపంచవ్యాప్త మార్కెట్లలో దేశ పోటీతత్వాన్ని పెంచడానికి సాయపడుతుంది.

ఎగుమతుల వృద్ధి సామర్థ్యాలను పెంపొందించే చర్యలు

- ఎగుమతి సామర్థ్యాన్ని పెంచడానికి, ఖర్చులను తగ్గించడానికి దేశం తన లాజిస్టిక్స్, వాణిజ్య మౌలిక సదుపాయాలను ఆధునీకరించాలి.
- ప్రస్తుతం చేపట్టిన భారత్‌మాల, సాగర్‌మాల కార్యక్రమాలకు అనుబంధంగా, ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్‌ప్లాన్ బహువిధ రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది.
- తద్వారా పరిశ్రమల నుంచి ఓడరేవులకు సజావుగా అనుసంధానం సాధ్యమవుతుంది.
- డిజిటల్ టెక్నాలజీ ఉపయోగించడం - కృత్రిమ మేధస్సుతో నడిచే రిస్క్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లతో సహా కస్టమ్స్ ప్రక్రియలను క్రమబద్ధీకరిస్తుంది.
- ఇది ఎగుమతి జాప్యాలను తగ్గించడంలో సాయపడుతుంది.
- రద్దీని తగ్గించడానికి ఓడరేవులకు సమీపంలో ఉన్న ఎగుమతి కేంద్రాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి.
- మౌలిక సదుపాయాలతో పాటు దేశ సరఫరా గొలుసులను బలోపేతం చేయడంపై కీలక దృష్టి పెట్టారు.
- ప్రపంచ డిమాండ్ నమూనాలకు అనుగుణంగా ఉండే ముఖ్యమైన రంగాలకు మద్దతు ఇవ్వడం ద్వారా విదేశీ మార్కెట్లలో దేశాన్ని ప్రీమియం వస్తువుల సరఫరాదారుగా నిలబెట్టడానికి, ప్రపంచవ్యాప్త విలువ గొలుసుల్లో చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- అధిక విలువ కలిగిన తయారీ రంగంలో స్వయం సమృద్ధిని పెంచడం అంటే స్థానిక ఉత్పత్తిని పెంచడం, ఉపాధిని సృష్టించడం, దేశ ఎగుమతి సామర్థ్యాన్ని మెరుగుపరచడమేనని గుర్తించాలి.

- జీనియస్ పబ్లికేషన్స్ సౌజన్యంతో...

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో...

దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా వివిధ బ్రాంచీల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 500
- వీటిలో తెలంగాణ-13, ఏపీలో 22 ఖాళీలు ఉన్నాయి.
- **పోస్టులు:** ఆఫీస్ అసిస్టెంట్ (ప్యూన్)
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు స్థానిక భాష చదవడం, రాయడం వచ్చి ఉండాలి
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 23
- **వెబ్‌సైట్:** https://www.bankofbaroda.in

సైంటిఫిక్ ఆఫీసర్లు...

ఇండియన్ ఫార్మకోపియా కమిషన్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 7
- **పోస్టులు:** సైంటిఫిక్ ఆఫీసర్
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** www.ipc.gov.in

శ్యామా ప్రసాద్ పోర్ట్‌లో...

కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్ట్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 40
- **పోస్టులు:** అసిస్టెంట్ మేనేజర్, స్టేషన్ మాస్టర్, రేడియో ఆఫీసర్, కమర్షియల్ డ్యూటీ క్లర్క్ తదితరాలు
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 30
- **వెబ్‌సైట్:** https://smp.snoirtkolkata.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

- గ్రూప్-డి, ఆర్.ఆర్.బి : కరెంట్ అఫైర్స్, ఎంబీఏ స్పెషల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

అంతర్ దృష్టి అభ్యసనం అనేది?

టెట్ ప్రత్యేకం

సైకాలజీ

యత్నదోష అభ్యసన సిద్ధాంతం

1. **థారన్‌డైక్ ప్రతిపాదించిన 'యత్నదోష అభ్యసన సిద్ధాంతానికి' సంబంధం లేని వాక్యాన్ని గుర్తించండి.**
1) థారన్‌డైక్ విలియం జేమ్స్ వల్ల ప్రభావితుడయ్యాడు
2) అభ్యసనంలో ఉద్దీపనకు, ప్రతిస్పందనకు మధ్య నాడీ సంధానం జరుగుతుంది
3) థారన్‌డైక్ గ్రంథాలు- యానిమల్ ఇంటెలిజెన్స్, మెజర్‌మెంట్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్
4) ఎలుకలు, పావురాలపై విస్తృతమైన ప్రయోగాలు నిర్వహించారు

2. **'గుర్రాన్ని తొట్టి వరకు తీసుకెళ్లగలం కానీ, దానితో నీటిని తాగించలేం' అనే సామెతకు సంబంధించిన సరైన వివరణ ఏది?**
1) గుర్రం శారీరకంగా, మానసికంగా సిద్ధంగా లేదు
2) గుర్రం శారీరకంగా సిద్ధంగా ఉంది, కానీ మానసికంగా సిద్ధంగా లేదు
3) గుర్రం మానసికంగా, శారీరకంగా సిద్ధంగా ఉంది
4) గుర్రం మానసికంగా సిద్ధంగా ఉంది, కానీ శారీరకంగా సిద్ధంగా లేదు

3. **కుమార్ అనే ఉపాధ్యాయుడు, విద్యార్థులను తాను బోధించే పాఠ్యాంశంలో భాగస్వాములను చేయడానికి పూర్వజ్ఞానం పరిశీలిచడం, ఉన్ముఖీకరణం, శీర్షికా ప్రకటన వంటివి తరగతిలో అమలు చేయడాన్ని సూచించే నియమం ఏది?**
1) ఫలిత నియమం
2) అభ్యాస నియమం
3) సంసిద్ధతా నియమం
4) బహుళ ప్రతిస్పందన నియమం

4. **కింది వివరణలను పరిశీలించండి.**
ఎ. విద్యార్థులకు సాధించగలిగే కృత్యాలను మాత్రమే ఇవ్వడం- ఫలిత నియమం
బి. పుట్టిన వెంటనే శిశువు వర్ణాలను నేర్చుకోలేడు- సంసిద్ధ నియమం
సి. సాధనమున పనులు సమకూరు ధరలోన- అభ్యాస నియమం
డి. మనస్సు ఉంటే మార్గం ఉంటుంది- ఫలిత నియమం
పై వాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) డి

5. ఎ. ఏదైనా ఒక రాగాన్ని పదే పదే పాడుతూ ఉంటే వినడానికి వినసొంపుగా ఉంటుంది
బి. సైకిల్ తొక్కడం నేర్చుకున్న తర్వాత పదే పదే తొక్కుతూ ఉంటే దానిలో నైపుణ్యం పొందవచ్చనే వాక్యాలను సమర్థించే నియమం ఏది?
1) ఉపయోగ నియమం
2) సంతృప్తికర నియమం
3) నిరుపయోగ నియమం
4) అసంతృప్తికర నియమం

6. **ఎ. అర్చన తనకిచ్చిన సమస్యల్లో ఐదు సమస్యలను సాధించగా, ఆరో సమస్య రాకపోయినా చేయడానికి అర్చన ప్రయత్నించడం**
బి. అంకిత్ తనకిచ్చిన సమస్యల్లో నాలుగు సమస్యలు సాధించలేకపోయేసరికి ఐదో సమస్య సాధించగలిగేదైనా సరే సాధించడానికి అంకిత్ ప్రయత్నించకపోవడాన్ని సూచించే నియమాలు వరుసగా?
1) అసంతృప్తికర, సంతృప్తి నియమం
2) ఉపయోగ, అసంతృప్తి నియమం
3) సంతృప్తి, అసంతృప్తికర నియమం
4) నిరుపయోగ, సంతృప్తి నియమం

7. **క్రికెట్‌లో ఎక్కువ వరల్డ్ కప్‌లు గెలిచిన ఆస్ట్రేలియా 2019లోనూ గెలవాలని ఎలా ఆడిందో, క్రికెట్ పుట్టినిల్లు అయిన ఇంగ్లండ్ మొదటిసారి ఎలాగైనా కప్ గెలవాలని అంతే బాగా ఆడి కప్ గెలవడాన్ని సూచించే నియమం ఏది?**
1) బహుళ ప్రతిస్పందన నియమం
2) ప్రేరణ కారక నియమం
3) పాక్షిక చర్యా నియమం
4) సామీప్యతా/సంసర్గ నియమం

8. **అశోక్ అనే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గ్రీనిచ్ సమయం బోధించేటప్పుడు ఒకే కాలానికి వేర్వేరు సమయాల వివరాలు, అవి అలా ఎందుకు ఉంటాయనేది కలిపి తెలియజేయడాన్ని సూచించే నియమం?**
1) సారూప్య/సాదృశ్య నియమం
2) సామీప్యతా/సంసర్గ నియమం
3) కాలవ్యవధి నియమం
4) సంబంధిత నియమం

9. **వంశీ అనే విద్యార్థికి ఆరో తరగతిలోని అన్ని సబ్జెక్టుల్లో తెలుగు అంటే చాలా ఎక్కువగా ఇష్టపడటం ద్వారా వంశీ తెలుగు సబ్జెక్టుపై పట్టు సాధించడాన్ని సూచించే నియమం ఏది?**
1) బహుళ ప్రతిస్పందన నియమం
2) ప్రేరణ కారక నియమం
3) పాక్షిక చర్యా నియమం
4) సారూప్య/సాదృశ్య నియమం

10. **ఎ. టైప్ నేర్చుకున్న పిల్లవాడు కంప్యూటర్ కీబోర్డ్‌ను సులభంగా నేర్చుకోవడం**
బి. బ్లాక్‌బోర్డ్ అనగానే చాక్‌పీస్ గుర్తుకు రావడాన్ని సూచించే నియమాలు వరుసగా?
1) సంబంధిత నియమం, సారూప్య/సాదృశ్య నియమం
2) సారూప్య/సాదృశ్య నియమం, సామీప్యతా/సంసర్గ నియమం
3) సారుప్యతా/సంసర్గ నియమం, సారూప్య/సాదృశ్య నియమం
4) సారూప్య/సాదృశ్య నియమం, పాక్షిక చర్యా నియమం

సమాధానాలు			
1. 4	2. 2	3. 3	4. 4
5. 1	6. 3	7. 2	8. 4
9. 3	10. 2		

అంతరదృష్టి, ప్రత్యక్ష అభ్యసన సిద్ధాంతాలు

1. **ఆశిష్ అనే విద్యార్థి రాత్రివేళ ఆకాశంలో నక్షత్రాలను, చందమామను విడివిడిగా కాకుండా మొత్తంగా కలిపి చూస్తూ అమితమైన ఆనందాన్ని పొందడంలో దాగి ఉన్న అభ్యసన వాదం ఏది?**
1) ప్రవర్తన/సంసర్గ వాదం
2) నిర్మాణాత్మక వాదం
3) గెస్టాల్ట్/సమగ్రాకృతి వాదం
4) పరిశీలనా వాదం

2. **ఆర్కిమెడిస్ స్నానం చేసే తొట్టిలో మునిగినప్పుడు, తొలగిపోయిన నీటిని చూసి హఠాత్తుగా వచ్చిన ఆలోచనతో ప్రతిపాదించిన ఆర్కిమెడిస్ నియమం ఏ అభ్యసనాన్ని సూచిస్తుంది?**
1) శాస్త్రీయ నిబంధన సిద్ధాంతం
2) అంతర దృష్టి అభ్యసనం
3) కార్యసాధక నిబంధన సిద్ధాంతం
4) యత్నదోష అభ్యసన సిద్ధాంతం

3. **శిశువు ప్రత్యక్షం చేసుకొనే ప్రతి అనుభవం మెదడులో వేర్వేరుగా నిక్షిప్తం కావు. పాత, కొత్త అనుభవాలు సంసర్గం చెంది స్మృతి పథ వ్యవస్థగా ఏర్పడుతుందని తెలిపినవారు?**
1) బండూరా 2) వైగాట్‌స్కీ
3) కోహెలర్ 4) కోఫ్‌కా

4. **కింది వాటిలో అంతరదృష్టి అభ్యసనానికి చెందిన ప్రవచనాలను గుర్తించండి.**
ఎ. రవి పులి బొమ్మను చూసి భయపడటం
బి. గోపి తాజ్‌మహల్ చిత్రాన్ని అద్భుతంగా గీయడం
సి. కుమార్ తన తండ్రి వలె ఆలోచించగలగడం
డి. రాజు సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణ చేయడం
1) ఎ, బి, డి సరైనవి
2) డి సరైనది
3) బి, సి సరైనవి 4) సి, డి సరైనవి

5. **కింది వాటిలో అంతర్ దృష్టి అభ్యసనం అనేది?**
1) తార్కికమైనది కాదు కానీ యాంత్రికమైనది
2) అర్థవంతం కాదు కానీ తార్కికమైనది
3) యాంత్రికమైనది, తార్కికమైనది
4) అర్థవంతమైనది, తార్కికమైనది

6. **కింది వాటిలో అంతర్ దృష్టి అభ్యసన సిద్ధాంతం లక్షణం కానిది?**
1) అభ్యాసం, పునరావృతాల అవసరం అభ్యసనానికి ఎక్కువ ఉండదు
2) అభ్యసనం, అభ్యాసం పునరావృతాలపై ఆధారపడి ఉంటుంది
3) ఇది సంశ్లేషణాత్మకమైనది
4) సంజ్ఞానాత్మక, మానసిక, శాబ్దిక అభ్యసనం జరగడానికి ఉపయోగపడుతుంది

7. **కింది వాటిలో అంతరదృష్టి అభ్యసనం జరిగే విధాన వరుసక్రమాన్ని గుర్తించండి.**
1) ప్రత్యక్షం--> ప్రత్యక్ష పునర్ వ్యవస్థీకరణ--> ఏకాగ్రత--> అవధానం-->అంతరదృష్టి
2) ప్రత్యక్ష పునర్ వ్యవస్థీకరణం--> ప్రత్యక్షం--> ఏకాగ్రత-->అవధానం-->అంతరదృష్టి
3) ఏకాగ్రత-->అవధానం--> ప్రత్యక్షం--> ప్రత్యక్ష పునర్ వ్యవస్థీకరణం--> అంతరదృష్టి
4) అవధానం--> ప్రత్యక్షం--> ఏకాగ్రత--> అంతరదృష్టి-->ప్రత్యక్ష పునర్ వ్యవస్థీకరణం

8. **కింది వాటిలో అంతర్ దృష్టి అభ్యసనాన్ని సూచించని వాక్యాన్ని గుర్తించండి.**
1) ఇది సంక్లిష్టమైన అభ్యసన విధానం
2) అభ్యసనం మెరుపులాగా మెరిసే మెదడులోని ఆలోచన వల్ల తటాలున జరుగుతుంది
3) అభ్యసనం ఒక కచ్చితమైన ప్రయత్నం వల్ల జరుగుతుంది
4) అభ్యసనం క్రమంగా, నెమ్మదిగా కొనసాగుతుంది

9. **ఎ. రాణి తన తల్లి వలె అందంగా ముగ్గులు వేయడం- అనుకరణ అభ్యసనం**
బి. చరణ్ కుక్క కరిచిన అనుభవంతో, కుక్కలకు ఎప్పుడూ దూరంగా ఉండటం- జ్ఞానేంద్రియ చలన అభ్యసనం
సి. వాణి గణితంలోని అర్థమెటిక్ ప్రశ్నలను సులభంగా సాధించగలగడం- యత్నదోష అభ్యసనం
పై వాక్యాల్లో సరైనవి ఏవి?
1) ఎ, బి 2) బి, సి
3) సి, ఎ 4) సి

10. **కర్ట్ కోఫ్‌కా కు సంబంధించి సరికాని ప్రవచనాన్ని గుర్తించండి?**
1) కోఫ్‌కా ప్రత్యక్షం మీద ఎక్కువ పరిశోధనలు చేశారు
2) కోఫ్‌కా ప్రత్యక్ష అభ్యసన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు
3) కోఫ్‌కా మెజర్‌మెంట్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్ గ్రంథాన్ని రచించారు
4) వర్ధిమర్, కోహెలర్‌తో కలిసి ఫ్రాంక్‌ఫర్ట్ యూనివర్సిటీలో పని చేశారు

సమాధానాలు			
1. 3	2. 2	3. 4	4. 2
5. 4	6. 2	7. 3	8. 4
9. 1	10. 3		

శివపల్లి
సైకాలజీ ఫ్యాకల్టీ
టీఎస్, ఏపీ
ఏకేఆర్ స్టడీ సర్కిల్

మీకు తెలుసా

- పూర్వం తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండేది.
- హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నప్పుడు తెలంగాణలో మొత్తం జిల్లాల సంఖ్య- 8.
- హైదరాబాద్ సంస్థానంపై 1948, సెప్టెంబర్ 17న పోలీసు చర్య ఫలితంగా ఈ సంస్థానం దేశంలో విలీనమైంది.
- 1948 చివరి వరకు జె.ఎన్. చౌదరి హైదరాబాద్ రాష్ట్రానికి మిలటరీ గవర్నర్‌గా కొనసాగారు.
- 1950, జనవరి నుంచి 1952 సాధారణ ఎన్నికల వరకు ఎం.కె. వెల్లోడి ముఖ్యమంత్రిగా పౌర ప్రభుత్వం ఏర్పడింది.
- 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది.
- 1953, అక్టోబర్ 1న దేశంలోని రాష్ట్రాలను పునర్విభజించడానికి నెహ్రూ ప్రభుత్వం రాష్ట్రాల పునర్విభజన సంఘాన్ని ప్రకటించింది. ఈ సంఘానికి సయ్యద్ ఫజల్ అలీని అధ్యక్షుడిగా నియమించింది.
- ఈ సంఘం ఆంధ్ర రాష్ట్రానికి, హైదరాబాద్ రాష్ట్రానికి విలీనం చేయడం వల్ల కలిగే లాభనష్టాలను వివరిస్తూ తన నివేదికను 1955, సెప్టెంబర్ 30న సమర్పించింది.
- 1956, ఫిబ్రవరి 20న ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య అభిప్రాయ భేదాలు తొలగించడానికి రెండు ప్రాంతాల నాయకులను ఢిల్లీలో సమావేశపరిచారు. దీన్నే పెద్ద మనుషుల ఒప్పందం అంటారు. ఈ ఒప్పందంలో తెలంగాణ ప్రాంతానికి కొన్ని రక్షణలు కల్పించారు.
- ఎంతోమంది మేధావులు, కార్మిక, ఉద్యోగ, కుల, విద్యార్థి సంఘాలు, సకల జనుల మనోభావాల ఆకాంక్షతో పాటే విద్యార్థుల బలిదానాలు అన్ని పార్టీలు కలిసి తెలంగాణ కోసం పోరాటం సాగించడంతో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఇవ్వక తప్పలేదు.
- తెలంగాణ ఏర్పాటు చేస్తున్నట్లు 2009, డిసెంబర్ 9న కేంద్రం ప్రకటన చేసింది. ఈ ప్రక్రియ సానుకూలంగా ముందుకు సాగలేదు.
- ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను పరిశీలించడానికి 2010, ఫిబ్రవరి 3న కేంద్రం శ్రీకృష్ణ కమిటీని నియమించింది.
- 2013, జూలై 30న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.
- 2014, ఫిబ్రవరి 6న తెలంగాణ బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించింది.
- 2014, ఫిబ్రవరి 13న తెలంగాణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.
- 2014, ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదం పొందింది.
- 2014, మార్చి 1న తెలంగాణ బిల్లుపై రాష్ట్రపతి సంతకం చేశారు.
- 2014, మార్చి 2న తెలంగాణ గెజిట్ ప్రకటన, మార్చి 4న తెలంగాణ అపాయింటెడ్ డే జూన్ 2ను ప్రకటించారు.